సాక్షి
ఆదిలాబాద్

దీపావళి శుభాకాంక్షలు

సోమవారం । 20 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

మద్యం షాపుల దరఖాస్తు గడువు పెంపు

- ఈనెల 23 వరకు అవకాశం
- 27న లక్కీడ్రా

ఆదిలాబాద్‌టౌన్: మద్యం షాపుల దరఖాస్తుల గడువు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎక్సైజ్ జిల్లా అధికారి హిమశ్రీ తెలిపారు. శనివారంతో దరఖాస్తుల ప్రక్రియ ముగిసిన విషయం తెలిసిందే. టెండర్ ప్రక్రియలో జిల్లా, రాష్ట్రస్థాయిలో అనుకున్న స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో ప్రభుత్వం ఈ గడువు పెంచింది. గతనెల 26 నుంచి ఈనెల 18 వరకు దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 40 షాపులకు గాను 711 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అయితే 2023–25 టెండర్ ప్రక్రియలో 1,047 దరఖాస్తులు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సారి 336 దరఖాస్తులు తక్కువగా వచ్చాయి. అయితే గతంలో దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు ఉండగా, ఈసారి ప్రభుత్వం రూ.3లక్షలకు పెంచింది. ఆదాయం తగ్గకపోయినా దరఖాస్తులు ఆశించిన స్థాయిలో రాలేదు. దీంతో ప్రభుత్వం గడువు పెంచింది. ఈనెల 23న లక్కీడ్రా నిర్వహించాల్సి ఉండగా, ఆ తేది వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. జిల్లా కేంద్రంలోని రత్నగార్డెన్‌లో ఈనెల 27న కలెక్టర్ సమక్షంలో డ్రా తీయనున్నారు. అయితే పది కంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన షాపులపై ఆ శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. మరికొద్ది దరఖాస్తులు పెరిగే అవకాశం ఉంది.

శ్రీలక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకున్న కలెక్టర్



పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ కుటుంబ సభ్యులు

జైనథ్: మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని కలెక్టర్ రాజర్షిషా కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రత్యేకతను అధికారులు వివరించారు. కార్తీక మాసంలో బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పరిశుభ్రత, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలపై దృష్టి సారించాలని కలెక్టర్ వారికి సూచించారు. ఆయన వెంట ఆలయ కమిటీ చైర్మన్ రూకేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, ఆలయ కమిటీ సిబ్బంది ఉన్నారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ దీపావళి శుభాకాంక్షలు

కైలాస్‌నగర్: జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజర్షిషా దీపావళి, దండారీ పండుగల శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ ఇంట్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలు పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. గుస్సాడి నృత్యం గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, భావితరాలకు అందించాలని సూచించారు.

వెలుగుల పండుగొచ్చే..



టపాసులు కొనుగోలు చేస్తున్న జనం

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి. వెలుగుల పండుగను నేడు వైభవంగా నిర్వహించుకునేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. లక్ష్మీపూజలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. సాయంత్రం టపాసుల మోతకు చిన్నా పెద్దా రెడీ అవుతున్నారు.

అవినీతి.. చెక్‌పోస్టు!

- 'భోరజ్'లో ఏసీబీ దాడులు
- లెక్కకుమించిన నగదు రూ.1.26లక్షలు స్వాధీనం
- ప్రైవేట్ వ్యక్తులతో అక్రమాలకు తెర
- డబ్బాలో డబ్బులు వేస్తున్న వాహనదారులు
- అధికారులను ప్రశ్నించిన ఏసీబీ.. నగదు తమది కాదని తప్పించుకునే యత్నం



భోరజ్ చెక్‌పోస్టు

ఆదిలాబాద్‌టౌన్: భోరజ్ చెక్ పోస్టు.. అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారిందనే విమర్శలున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లా మీదుగా వెళ్లే వాహనాలను తనిఖీ పేరిట అధికారులు, సిబ్బంది అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. తరచూ ఏసీబీ దాడులు జరిగినప్పుడు లెక్క కుమించి నగదు పట్టుబడుతుండడం గమనార్హం. ఈ అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఇటీవల అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే వాహనదారులకు ఆన్‌లైన్ విధానంపై అవగాహన కల్పిస్తామని చెబుతూ ఇక్కడి అధికారులు అందినకాడికి దండుకుంటున్నట్లు తెలుస్తోంది. కేవలం గంటల వ్యవధిలోనే డబ్బాలో రూ.లక్ష జమ అయితే.. రోజుకు ఎంత జమ అవుతుందోనని సర్వత్రా చర్చించుకుంటున్నారు. ఈ అక్రమ వసూళ్లలో కింది నుంచి పైస్థాయి అధికారుల వరకు వాటాలు ఉంటాయనేది బహిరంగ రహస్యమే. ఇక్కడ డ్యూటీ అంటే కాసుల పంట అనే ప్రచారం ఉంది. గతంలో ఇక్కడ విధుల కోసం అధికారుల గొడవలు రాష్ట్రస్థాయి వరకు వెళ్లిన విషయం విదితమే. ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినప్పటికీ మార్పు కానరావడం లేదు. డబ్బులు పట్టుబడినప్పుడు నామ్‌కే వాస్తే వివరణ తప్పా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో వారి ఆగడాలు మితిమీరుతున్నట్లు తెలుస్తోంది. ఏసీబీ అధికారుల ముందే లారీ డ్రైవర్లు, క్లీనర్లు డబ్బాలో నగదు వేయడాన్ని చూసి ఆశ్చర్యపోయారు. ఎందుకు డబ్బులు వేస్తున్నారంటే మరికొంత ఎక్కువ వేస్తామని చెప్పడం అవినీతి ఏ మేరకు పేరుకుపోయిందో తెలిసిపోతోంది.

లెక్కకు మించిన డబ్బులెక్కడివి..

ఈ చెక్‌పోస్టు జాతీయ రహదారి 44కు ఆనుకొని ఉంటుంది. ఈ మార్గం గుండా వెళ్లే భారీ వాహనాలకు సంబంధించి పర్మిట్, ఓవర్‌లోడ్, లైసెన్సులు, ట్యాక్స్‌లు, ఇతరత్రా పత్రాలు సరిగా ఉన్నాయా.. లేదా అనేది చెక్ చేసి పంపించాల్సి ఉంటుంది. 24 గంటల పాటు అక్కడికి వచ్చిపోయే వాహనాల తనిఖీతో చెక్‌పోస్టు ప్రాంతం సందడిగా ఉంటుంది. ముఖ్యంగా ఇక్కడ రవాణాశాఖ అధికారులతో పాటు ప్రైవేట్ సిబ్బంది వాటికి సంబంధించిన ప్రక్రియ చేపట్టి లోటుపాట్లు గుర్తించి అక్రమంగా డబ్బులు వసూలు చేయడమే విధిగా సాగుతుంటుందనేది బహిరంగ రహస్యమే. ఏటా ఏసీబీ అధికారులు తనిఖీల్లో భాగంగా సోదాలు నిర్వహిస్తారు. అయితే ప్రతీసారి లెక్కకు మించి నగదు లభిస్తుండడం గమనార్హం. గతేడాది డిసెంబర్ 4న ఏసీబీ దాడి చేయగా, లెక్కకు మించి రూ.62,500 నగదు పట్టుబడిన విషయం తెలిసిందే. అంతకుముందు జరిపిన దాడుల్లోనూ లెక్కకుమించి డబ్బులు లభించడం పరిస్థితికి అద్దం పడుతోంది.

ఏసీబీ దాడి..

భోరజ్ మండలకేంద్రంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఏసీబీ అధికారులు శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము 5 గంటల వరకు తనిఖీ చేపట్టారు. నిబంధనల ప్రకారం వచ్చిన డబ్బులు పక్కనబెడితే, రూ.లక్ష 26వేలు అదనంగా ఉన్నట్లు అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు రవాణా శాఖ చెక్‌పోస్టుల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఆ సమయంలో ఇక్కడ ఇద్దరు ఆర్టీఏ అధికారులతో పాటు ఒక హోంగార్డు, ఒక సెక్యూరిటీ, నలుగురు ప్రైవేట్ వ్యక్తులు ఉన్నారు. అదనంగా ఉన్న డబ్బుల గురించి ఏసీబీ అధికారులు ప్రశ్నించగా.. ఆ డబ్బులతో తమకు సంబంధం లేదని చెప్పడం గమనార్హం. కార్యాలయ ఆవరణలో ఓ డబ్బా ఏర్పాటు చేయగా, వాహన డ్రైవర్లు, క్లీనర్లు అందులో నగదు వేసి పత్రాలపై ముద్ర వేసుకొని వెళ్లడాన్ని గమనించారు. ఒక్కో వాహనానికి రూ.300 నుంచి రూ.500, ఆపై డబ్బులు వేసినట్లు ఏసీబీ అధికారులు గమనించారు. గంటల వ్యవధిలోనే రూ.లక్షకు పైగా జమ కావడంతో ఆశ్చర్యానికి లోనయ్యారు. ఈ లెక్కన రోజు రూ.లక్షల్లో వసూలవుతున్నట్లు తెలుస్తోంది. అదనపు డబ్బులను ఏసీబీ అధికారులు సీజ్ చేసి ప్రభుత్వ ఖజానాలో జమ చేశారు. ఇక్కడ జరిగిన తంతుపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.

షరా మామూలే..

ఈ చెక్‌పోస్టు వద్ద డబ్బుల వసూలు కొన్నేళ్లుగా షరా మామూలుగానే జరుగుతోంది. ఉత్తరభారతం వైపు నుంచి జిల్లా మీదుగా దాదాపు రోజుకు 3వేల నుంచి 4వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రవాణాశాఖ అధికారులు వాహనాలను తనిఖీ చేసినప్పుడు ఓవర్‌లోడ్ ఉందా.. సరుకులు వేసిన సమయంలో ప్రస్తుతం వాటికి సరితూగిందా లేదా, జీరో లోడ్ తీసుకెళ్తున్నారా.. పర్మిట్‌లో ఉన్న రోడ్డు మార్గం గుండానే వెళ్తున్నారా అనే విషయాలను పరిశీలిస్తారు. ఒకవేళ ఇందులో లోటుపాట్లు ఉంటే జరిమానాతో పాటు వేలాది రూపాయలు అక్రమంగా తీసుకుంటారనేది బహిరంగ చర్చ సాగుతోంది. ఈ విషయమై రవాణా శాఖ అధికారులను వివరణ కోరగా, స్పందించేందుకు వారు నిరాకరించారు. మరికొంత మంది అధికారులు ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకోగా, ఇంకొందరు అందుబాటులోకి రాలేదు.

ఆదివాసీ సంస్కృతికి ప్రతీక దండారీ

- ఎస్పీ అఖిల్ మహాజన్

నార్నూర్: ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం దండారీ ఉత్సవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మండలంలోని జామ్‌డా గ్రామంలో ఆదివారం నిర్వహించిన దండారీ ఉత్సవాలకు ఆయన అతిథిగా హాజరయ్యారు. జిల్లా సార్‌మేడి దుర్గు పటేల్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఎస్పీ వారితో కలిసి గుస్సాడి నృత్యం చేశారు. అనంతరం 50 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయలను భావితరాలకు అందించాలన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ ప్రసాద్, నార్నూర్ సీఐ పద్మ, తహసీల్దార్ జాడి రాజలింగు, ఎంపీడీవో గంగాసింగ్, ఆదివాసీ పెద్దలు చెంచు రామకృష్ణ, ఎస్సైలు సాయన్న, అఖిల్ తదితరులున్నారు.



దండారీ ఉత్సవాల్లో పాల్గొన్న ఎస్పీ అఖిల్

కేస్లాపూర్‌లో..

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్‌లో నిర్వహించిన దండారీ ఉత్సవాలకు ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యేత్మసూర్ దేవతలకు పూజలు నిర్వహించారు. దండారీలతో కలిసి నృత్యం చేశారు. ఆదివాసీలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ ప్రసాద్, స్థానిక ఎస్సై సాయన్న, గ్రామ పటేల్ వెంకట్‌రావ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లక్ష్మీపూర్‌లో పాల్గొన్న ఎంపీ నగేశ్..

బోథ్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన దండారీ ఉత్సవాలకు ఎంపీ గోడం నగేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దండారీ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం సంతోషం కలిగిస్తోందన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ నగేశ్

కలంపై జులుం సరికాదు



కైలాస్‌నగర్: నిజాలను నిర్భయంగా రాస్తున్న జర్నలిస్టులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరించడం సరికాదని వివిధ వర్గాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. 'సాక్షి' ఎడిటర్ ధనంజయ్‌రెడ్డిపై పోలీసులతో అక్రమ కేసులు నమోదు చేయించి జులుం ప్రదర్శించడాన్ని వారు తప్పుపట్టారు. మీడియాను అణచివేయాలనే విధానాలు మానుకోవాలని స్పష్టం చేశారు.

పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్నారు



ఏపీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను కాలరాసేలా వ్యవహరిస్తోంది. మీడియాలో ప్రసారం చేసిన కథనాలపై, దినపత్రికల్లో ప్రచురితమైన వార్తలపై ఏమైనా అభ్యంతరాలుంటే వివరణ ఇవ్వడమో లేక ఖండించడమో చేయాలి. కానీ పోలీసులతో నోటీసులు పంపించి 'సాక్షి' ఎడిటర్, జర్నలిస్టులపై బెదిరింపులకు దిగడం అప్రజాస్వామికం. ఈ చర్యలను మానుకోవాలి.

– సిర్రా దేవేందర్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి

భావవ్యక్తీకరణ హక్కు హరించడమే



జర్నలిస్టులను అణచివేయాలనే ఉద్దేశంతో పోలీసులతో ఏపీ ప్రభుత్వం కేసులు నమోదు చేయించి బెదిరింపులకు దిగడం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను హరించడమే అవుతుంది. సాక్షి ఎడిటర్ ధనంజయ్‌రెడ్డిపై అక్రమంగా నమోదు చేసిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలి.

– దర్శనాల అశోక్, కాంగ్రెస్ నాయకుడు

వాస్తవాలు రాస్తే వేధింపులా..?



వాస్తవాలను వెలుగులోకి తెచ్చి ప్రజలకు వివరిస్తున్న 'సాక్షి'పై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగడం సరికాదు. ఇది కేవలం ఒక మీడియా సంస్థపై దాడి కాదు, పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న ప్రత్యక్ష దాడి. ప్రజాస్వామ్య విలువలు క్షీణిస్తున్నాయనేందుకు ఈ చర్యలు నిదర్శనం.

– ఫిరోజ్ ఖాన్, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్

డిప్యూటేషన్ కోసం ఐదు దరఖాస్తులు

కైలాస్‌నగర్: జీవో 317 కింద ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు తమ సొంత జిల్లాకు డిప్యూటేషన్ వెళ్లేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆసక్తిగల వారు ఈనెల 21లోగా జిల్లా పంచాయతీ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో జిల్లాలో ఇప్పటివరకు ఐదుగురు కార్యదర్శులు దరఖాస్తు చేసుకున్నారు. కాగా ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న వారు సైతం ఇక్కడికి వచ్చేందుకు దరఖాస్తు చేసుకుంటున్నట్లు సమాచారం.

- రెండు నెలలైనా ముందుకు సాగట్లే..
- నిధులు విడుదలైనా షురూ కాని పనులు

ప్రీప్రైమరీ ప్రారంభమెప్పుడో!



ప్రీప్రైమరీకి ఎంపికైన కేఆర్‌కె పాఠశాల

ఆదిలాబాద్‌టౌన్: దేవుడు వరమిచ్చినా.. పూజారి కనికరించలేదన్న చందంగా మారింది విద్యాశాఖ తీరు. జూలై 16న పాఠశాల విద్యాశాఖాధికారులు జిల్లాకు ప్రీప్రైమరీ పాఠశాలలను ఎంపిక చేశారు. గత నెల 27న ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలు చేపట్టారు. ప్రాథమిక పాఠశాలల్లో తరగతులు ప్రారంభించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ సౌకర్యాలు, మరమ్మతుల పేరిట జాప్యం అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు నియామకమైన ఇన్‌స్ట్రక్టర్లు ఎప్పుడు విధుల్లో చేరుతామోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇవే పాఠశాలలు..

ప్రీప్రైమరీ విద్యాబోధన ప్రారంభించేందుకు జిల్లాలో ఈ ఏడాది 15 పాఠశాలలను ఎంపిక చేయగా, గత విద్యాసంవత్సరంలో నాలుగు పాఠశాలలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఇందులో కేశవపట్నం ప్రాథమిక పాఠశాల, దుబ్బ(కె), కంఠ, తాండబాబాపూర్, వైజాపూర్, ముత్నూర్, బరంపూర్, రాంపూర్(పి), మల్కాపూర్, చెర్లపల్లి, గుబిడి, యాపల్‌గూడ, కేఆర్‌కే కాలనీ, పిప్పల్‌కోటి తెలుగు మీడియం, బాలక్‌మందిర్ పాఠశాలలు ఉన్నాయి. అయితే గతేడాది జైనథ్ మండలంలోని దీపాయిగూడ, సిరికొండ, భీంపూర్ మండలంలోని నిపాని, గాదిగూడలోని చింతగూడ పాఠశాలల్లో ప్రారంభించింది.

ప్రారంభమయ్యేదెప్పుడో..

ప్రీప్రైమరీ పాఠశాలల నిర్వహణ కోసం ప్రభుత్వం ఒక్కోపాఠశాలకు రూ.లక్ష 70వేలు కేటాయించింది. ఇందులో ఫర్నిచర్ కోసం రూ.50వేలు, టీఎల్ఎం కోసం రూ.50వేలు, పెయింటింగ్ కోసం రూ.50వేలు, 20మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున ఖర్చు చేయనున్నారు. విద్యార్థులకు షూ, యూనిఫాం అందించాల్సి ఉంది. ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ కోసం ఒక గదిని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. విద్యార్థులను ఆకర్షించేలా పెయింటింగ్ వేయించాల్సి ఉండగా, ఆ దిశగా పనులు సాగడం లేదు. ఈ నెలలో కూడా తరగతులు ప్రారంభమవుతాయో.. లేదోననే అనుమానం వ్యక్తమవుతుంది. నాలుగేళ్లు పైబడిన చిన్నారులకు ఎల్‌కేజీలో ప్రవేశం కల్పిస్తారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆట పాటలతో విద్యాబోధన చేయాల్సి ఉంటుంది. అయితే 19 పాఠశాలలకు సంబంధించి 18 మంది ఇన్‌స్ట్రక్టర్లను, 17 మంది ఆయాలను ఎంపిక చేశారు. ఇన్‌స్ట్రక్టర్లకు రూ.8వేలు, ఆయాలకు రూ.6వేలు గౌరవ వేతనం చెల్లిస్తారు. పది నెలల పాటు వీరు పనిచేయాల్సి ఉంటుంది. గతేడాది నిపాని పాఠశాల ఎంపికైనప్పటికీ గదులు లేవని సిబ్బందిని నియమించలేదు. తరగతులు కూడా ప్రారంభం కాలేదు. సిరికొండలో ఆయాకు క్వాలిఫికేషన్ లేకపోవడంతో నియామకం జరగలేదు. కంఠలో ఆయా పోస్టు భర్తీకాలేదు. దీపాయిగూడలో గతేడాది పనిచేసిన వారిని కొనసాగించాలా.. లేదా అనే విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. గతేడాది చింతగూడలో ప్రారంభమైనా ఆమె సక్రమంగా విధులు నిర్వహించడం లేదని తొలగించారు.

త్వరలో ప్రారంభిస్తాం..

ప్రీప్రైమరీ పాఠశాలలకు సంబంధించి ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలను నియమించడం జరిగింది. జిల్లాలో గతేడాది నాలుగు పాఠశాలలను ప్రారంభించగా, ఈ ఏడాది మరో 15 ఎంపికయ్యాయి. ఆయా పాఠశాలల్లో పనులు ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభిస్తాం.

– అజయ్, సెక్టోరల్ అధికారి

లైసెన్స్‌డ్ సర్వేయర్లు వచ్చేస్తున్నారు

- సీఎం చేతుల మీదుగా నియామకపత్రాలు
- దీపావళి తర్వాత విధుల్లోకి

కైలాస్‌నగర్: జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలో కొత్తగా లైసెన్స్‌డ్ సర్వేయర్లు వచ్చేస్తున్నారు. జిల్లాలో నిర్వహించిన వృత్తిపరమైన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 44 మంది ఆ శాఖ అధికారులతో కలిసి ఆదివారం వేకువజామున ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. శిల్పకళా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి చేతుల మీదుగా వారు లైసెన్స్ పత్రాలు అందుకున్నారు. గుడిహత్నూర్ మండలం తోషం తండాకు చెందిన జాదవ్ కీర్తి స్వయంగా సీఎం చేతుల నుంచి లైసెన్స్ పత్రం అందుకోగా మిగతా వారికి అక్కడి అధికారులు ప్రత్యేక కౌంటర్ ద్వారా అందజేశారు. దీపావళి తర్వాత వీరంతా జిల్లాలో విధుల్లో చేరనున్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వేల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు రాజేందర్, ఉద్యోగులు గోవింద్, తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిల్పకళా వేదిక వద్ద అధికారులు, లైసెన్స్‌పత్రాలు అందుకున్న సర్వేయర్లు

'స్వయం'.. విస్తృతం

- జిల్లాలో మరిన్ని ఎస్‌హెచ్‌జీలు
- కిశోర బాలికలు, వృద్ధ మహిళలు, దివ్యాంగులతోనూ ఏర్పాటు
- కసరత్తు చేస్తున్న సెర్ప్ సిబ్బంది
- ఈ నెలాఖరు వరకు గడువు

కైలాస్‌నగర్:జిల్లాలోని గ్రామీణప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాలు మరింతగా పెరగనున్నాయి. 15 ఏళ్ల కిశోర బాలికల నుంచి 60 ఏళ్లు పైబడిన వృద్ధ మహిళల వరకు ఎస్‌హెచ్‌జీల్లో సభ్యులుగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి మిషన్–2025 కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లాకు ప్రత్యేక లక్ష్యాన్ని నిర్దేశించింది. వీరితో పాటు దివ్యాంగులతో కూడిన సంఘాలను సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఈమేరకు లక్ష్యాన్ని చేరుకునే దిశగా సెర్ప్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నెలాఖరులోగా సాధించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు.

కిశోర బాలికలపై ప్రత్యేక దృష్టి..

ప్రస్తుతం ఎస్‌హెచ్‌జీల్లో 18 నుంచి 60 ఏళ్లలోపు మహిళలు మాత్రమే ఉన్నారు. వారికి పొదుపుపై అవగాహన కల్పించడంతో పాటు బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారితో పాటు కేరళ రాష్ట్రంలో అమలవుతున్న కుటుంబ శ్రీ పథకం స్ఫూర్తిగా 15 నుంచి 18 ఏళ్ల లోపు కిశోర బాలికలపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. వారిని కూడా సంఘాల్లో సభ్యులుగా చేర్చాలని ఆదేశించింది. వారికి పొదుపుతో పాటు బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన కల్పించనున్నారు. దీంతో పాటు హ్యూమన్ ట్రాఫికింగ్, లైంగిక వేధింపులు సోషల్ మీడియా ద్వారా కలిగే అనర్థాలు, ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పిస్తారు. ముఖ్యంగా విద్య, ఉద్యోగ అవకాశాలను వివరించి సద్వినియోగం చేసుకునేలా చైతన్య పర్చనున్నారు.

60 ఏళ్లు పైబడిన వారిని కూడా...

సంఘాల్లో సభ్యులుగా ఉండి 60 ఏళ్లు పైబడిన మహిళలను సాధారణంగా సంఘాల్లో నుంచి తొలగిస్తున్నారు. అయితే ఆ వయస్సు కలిగిన మహిళలతోనూ సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పొదుపు చేసేలా చూడటంతో పాటు ఎలాంటి అండలేనటువంటి వారికి ఆర్థిక చేయూత ఇవ్వనున్నట్లుగా తెలుస్తోంది. దీనికి తోడు వారు ఏమైన చిన్నపాటి వ్యాపారాలు చేసుకోవాలనుకుంటే బ్యాంకుల ద్వారా రుణాలు అందజేసి ప్రోత్సహించనున్నట్లుగా తెలుస్తోంది.

దివ్యాంగులకు సైతం...

దివ్యాంగులతోనూ ఎస్‌హెచ్‌జీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే 18 ఏళ్లు నిండిన దివ్యాంగ మహిళలు, పురుషులను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి సంయుక్తంగా సంఘాలను ఏర్పాటు చేయనున్నారు. వీరికి కూడా అవసరమైన ఆర్థిక చేయూత అందించనున్నారు. ఇందులో భాగంగా వ్యాపారాల నిర్వహణకు గాను బ్యాంకుల ద్వారా రుణాలు అందించేలా చొరవ చూపనున్నారు.

జిల్లాలో..

ప్రస్తుతం ఉన్న ఎస్‌హెచ్‌జీలు	1,103
ఆయా సంఘాల్లోని సభ్యులు	1,21,514
కొత్త ఎస్‌హెచ్‌జీల లక్ష్యం, ఇతర వివరాలు	
మొత్తం వీవోలు	554
ఏర్పాటు చేయాల్సిన ఎస్‌హెచ్‌జీలు	2,216
ఆయా సంఘాల్లో చేర్చాల్సిన సభ్యులు	19,390
ఇప్పటి వరకు గుర్తించిన సభ్యులు	12,246



సిరికొండలో కొత్త సంఘాల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న డీపీఎంలు(ఫైల్)

సంఘాల ఏర్పాటు ఇలా..

ప్రతీ వీవో పరిధిలో కొత్తగా నాలుగు స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో ఒకటి జనరల్ కాగా, దివ్యాంగులు, వృద్ధ మహిళలు, కిశోర బాలిక ల కేటగిరీల వారీగా ఒక్కో సంఘాన్ని ఏర్పాటు చేయనున్నారు. జనరల్ సంఘాల్లో పది మంది సభ్యులు ఉండగా, దివ్యాంగులు, వృద్ధ మహిళలు, కిశోర బాలికలతో కూడిన సంఘాల్లో ఐదు నుంచి పది మంది వరకు ఉండనున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో కసరత్తు ప్రారంభించిన సెర్ప్ డీపీఎం, ఏపీఎంలు, సీసీలు, వీవోఏలు,వీవో ఓబీలు ఆయా వర్గాల వారిని గుర్తిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా కిశోర బాలికలు 4,133, వృద్ధ మహిళలు 3,570, దివ్యాంగులు 1,516, జనరల్ మహిళలు 6,412 మందిని గుర్తించారు. వీరిలో బ్యాంకు ఖాతాలు కలిగిన వారి వివరాలు సేకరిస్తుండగా, అవి లేనటువంటి వారికి కొత్తగా ఖాతాలు తెరిపిస్తున్నారు.

లక్ష్యసాధన దిశగా ..

కిశోర బాలికలు, వృద్ధ మహిళలు, దివ్యాంగులు, జనరల్ మహిళా సభ్యులతో కూడిన స్వయం సంఘాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆయా వర్గాల వారిని గుర్తిస్తూ సభ్యులుగా చేర్పిస్తున్నాం. ఈ నెలాఖరులోగా లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగుతున్నాం.

– రమాకాంత, డీపీఎం ఐబీ

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్‌ పోటీల్లో సత్తా



గోల్డ్‌మెడల్‌ అందుకుంటున్న కొమ్ము కృష్ణ

ఆదిలాబాద్‌: రాష్ట్రస్థాయి స్విమ్మింగ్‌ పోటీల్లో జిల్లాకు చెందిన కొమ్ము కృష్ణ సత్తా చాటాడు. హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో ఆదివారం నిర్వహించిన పదవ తెలంగాణ మాస్టర్‌ ఇంటర్‌ డిస్ట్రిక్ట్‌ స్విమ్మింగ్‌ ఛాంపియన్‌షిప్‌ పోటీల్లో 100 మీటర్స్‌ బ్రెస్ట్‌ స్ట్రోక్‌ ఈవెంట్లో గోల్డ్‌ మెడల్‌తో మెరిశాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలవడంపై డీవైఎస్‌ఓ జక్కుల శ్రీనివాస్‌, జిల్లా ఒలింపిక్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, పార్థసారథి తదితరులు అభినందించారు.

ఆలయంలో కుంభాభిషేక మహోత్సవం



ప్రవచనాలు ఇస్తున్న విధుశేఖర భారతి స్వామి

బాసర: బాసరలోని లలిత చంద్రమౌళీశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కుంభాభిషేక మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతిస్వామి హాజరై 12 జ్యోతిర్లింగాలు స్పటికలింగం ప్రాణప్రతిష్ఠను చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముధోల్‌ ఎమ్మెల్యే రామారావు పటేల్‌, నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్పాల్‌ సూర్యనారాయణ గుప్తాలు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో పూజలు చేశారు.

చెదరని నెత్తుటి జ్ఞాపకాలు

- నాటి నక్సలైట్ల దాడుల్లో 19 మంది పోలీసుల దుర్మరణం
- అమరుల కుటుంబాల్లో తీరని శోకం
- రేపు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

ఖానాపూర్‌: ఉమ్మడి రాష్ట్రంలోని ఆదిలాబాద్‌ జిల్లాకు నేటికి చెదరని నెత్తుటి చేదు జ్ఞాపకాలు.. అప్పటి పరిస్థితులు తలుచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. ఎటుచూసినా అన్నల అలజడి.. తుపాకీ మోత చప్పుళ్లు వినబడుతుండేవి. ప్రతీరోజు ఎక్కడో ఒకచోట నక్సలైట్ల విధ్వంసాలు, తరచూ ఎన్‌కౌంటర్లు జరుగుతుండేవి. వారి కవ్వింపు చర్యలను తిప్పికొట్టే ప్రయత్నాల్లో పలువురు పోలీసులు అమరులయ్యారు. వారి సేవలు మరువలేనివి. ఈక్రమంలోనే ఎన్నో సంఘటనలు జరిగాయి. 1983 నుంచి అప్పటి ఆదిలాబాద్‌లో ఉన్న నిర్మల్‌ జిల్లా పరిధిలో నక్సలైట్ల ప్రభావం పెరుగుతూ వచ్చింది. ఖానాపూర్‌ ప్రాంతంలో దట్టమైన అడవులు ఉండడంతో స్థావరాలు ఏర్పాటు చేసుకుని ఇక్కడి నుంచే కార్యకలాపాలు నడిపేవారు. జిల్లాలో మొదటిసారిగా ఇక్కడి నుంచే విద్రోహచర్యలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ఖానాపూర్‌ సర్కిల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో విధి నిర్వహణలో ఉన్న 19 మంది పోలీసులు నక్సలైట్ల తూటాలకు బలయ్యారు. వారి కుటుంబాల్లో తీరని శోకం మిగిల్చింది. ఈనెల 21 పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సాక్షి కథనం.

ఉమ్మడి రాష్ట్రంలోని ఆదిలాబాద్‌ జిల్లాకు నేటికి చెదరని నెత్తుటి చేదు జ్ఞాపకాలు.. అప్పటి పరిస్థితులు తలుచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. ఎటుచూసినా అన్నల అలజడి.. తుపాకీ మోత చప్పుళ్లు వినబడుతుండేవి. ప్రతీరోజు ఎక్కడో ఒకచోట నక్సలైట్ల విధ్వంసాలు, తరచూ ఎన్‌కౌంటర్లు జరుగుతుండేవి. వారి కవ్వింపు చర్యలను తిప్పికొట్టే ప్రయత్నాల్లో పలువురు పోలీసులు అమరులయ్యారు. వారి సేవలు మరువలేనివి. ఈక్రమంలోనే ఎన్నో సంఘటనలు జరిగాయి. 1983 నుంచి అప్పటి ఆదిలాబాద్‌లో ఉన్న నిర్మల్‌ జిల్లా పరిధిలో మెల్లమెల్లగా నక్సలైట్ల ప్రభావం పెరుగుతూ వచ్చింది. ఖానాపూర్‌ సర్కిల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో విధి నిర్వహణలో నక్సలైట్ల తూటాలకు 19 మంది పోలీసులు బలయ్యారు. ఖానాపూర్‌ ప్రాంతంలో దట్టమైన అడవులు ఉండడంతో నక్సలైట్లు స్థావరాలు ఏర్పాటు చేసుకుని ఇక్కడి నుంచే కార్యకలాపాలు నడిపేవారు. జిల్లాలో మొదటిసారిగా ఇక్కడి నుంచే నక్సలైట్లు విద్రోహచర్యలకు శ్రీకారం చుట్టారు.



ఖానాపూర్‌ సర్కిల్‌ పోలీస్‌ స్టేషన్‌లో పోలీసు అమరవీరుల స్మారక స్తూపం

ఖానాపూర్‌లో అమరుల స్తూపం

ఖానాపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమవీరుల స్మారకార్థం స్తూపం లేదు. పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో వేపచెట్టు కింద కొన్నేళ్లుగా శిలాఫలకంపై పేర్లు రాసి ఉంచారు. 2008లో అప్పటి సీఐ, ఎస్సైలు స్మారక స్తూప నిర్మాణానికి కృషిచేశారు. ప్రస్తుత సీఐ అజయ్‌తోపాటు ఎస్సై రాహుల్‌ గైక్వాడ్‌ వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు.

సంఘటనల వివరాలివే..

- 1987 ఆగస్టు 18న కడెం మండలం అల్లంపల్లి క్యాంపునకు పోలీసులు నడిచివెళ్తుండగా అద్దాల తిమ్మాపూర్‌ వద్ద 30 మంది నక్సలైట్లు పకడ్బందీ పథకం ప్రకారం మాటువేసి విచక్షణరహితంగా కాల్పులు జరిపారు. ఇద్దరు ఎస్సైలు, హెడ్‌ కానిస్టేబుల్‌, ఏడుగురు కానిస్టేబుళ్ల ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు కానిస్టేబుళ్లు తప్పించుకొని ప్రాణాలు కాపాడుకున్నారు. గంధం రామస్వామి ఉరఫ్‌ సాగర్‌ అనే దళ కమాండర్‌ నేతృత్వంలో ఈ దాడి జరిగింది. ఘటన స్థలాన్ని అప్పటి సీఎం ఎన్టీఆర్‌ పరిశీలించారు. జిల్లాను ఆదర్శ జిల్లాగా ప్రకటించి గిరిజనులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు.
- 1989 ఫిబ్రవరి 1న జరిగిన సంఘటనకు ఒక రోజు ముందు ఖానాపూర్‌ మండలం రాజూరా గ్రామంలో నక్సలైట్లు దోపిడీకి పాల్పడ్డారు. పోలీసులు ఆ గ్రామానికి వెళ్తుండగా కడెం మండలం సింగాపూర్‌ సమీపంలో పకడ్బందీ వ్యూహంతో నక్సలైట్లు పోలీసుల జీపును పేల్చివేశారు. ఎస్సై ఖాదర్‌ఉల్‌హక్‌, ఆరుగురు కానిస్టేబుళ్లు జి.బాపురావు, ఎండీ జలీల్‌, శేక్‌ హైదర్‌, వేణుగోపాల్‌, భోజారావు,ఎస్‌.మోహన్‌దాస్‌ ప్రాణాలు కోల్పోయారు. ఒకే కానిస్టేబుల్‌ ప్రాణాలతో బయటపడ్డాడు.
- 1999 డిసెంబర్‌ 5న కడెం మండలంలో బందోబస్తుకు వెళ్లి పోలీసులు వస్తుండగా ఖానాపూర్‌ మండలం తర్లపాడ్‌ గ్రామసమీపంలో నక్సలైట్లు రిమోట్‌కంట్రోలర్‌ సాయంతో పోలీసులు వెలుతున్న ప్రైవేటు జీపును పేల్చివేశారు. అందులో ప్రయాణిస్తున్న ఎస్సై మల్లేశ్‌తో పాటు కానిస్టేబుల్‌, ప్రైవేటు జీపు డ్రైవర్‌ దుర్మరణం చెందారు.

జన్నారం అందాలు చూసొద్దాం..



హరిత రిసార్ట్‌లో హైదరాబాద్‌ పర్యాటకులు

- వన్యప్రాణులు, పక్షుల సందడి
- మొదలైన జంగిల్‌ సఫారీ
- పెరిగిన పర్యాటకులు
- వీకెండ్‌లో గదులు ఫుల్‌

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌లో అందాలు ఆస్వాదిస్తూ.. వన్యప్రాణులు, రకరకాల పక్షులు, జంగిల్‌ సఫారీ ప్రయాణం ద్వారా పర్యాటకులు వీక్షించేందుకు అటవీశాఖ అనుమతి ఇచ్చింది. వర్షాలు తగ్గుముఖం పట్టడడంతో సఫారీ ప్రయాణానికి గ్రీన్‌సిగ్నల్‌ లభించింది. మూడు నెలల విరామం తర్వాత అక్టోబర్‌ 1 నుంచి జంగిల్‌ సఫారీ మొదలైంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ఇక్కడకు వచ్చి అడవులు చూసి మురిసిపోతున్నారు. పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణం మధ్య గడుపుతున్నారు. వీకెండ్‌ రోజుల్లో గదులు ఫుల్‌గా ఉంటున్నాయని పర్యాటక అధికారులు పేర్కొంటున్నారు.

15 రోజుల్లో 600 పైగా మంది

జంగిల్‌ సఫారీ మొదలైన 15 రోజుల్లో తెలంగాణ, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 600 పైగా మంది పర్యాటకులు ఇక్కడకు వచ్చారని అధికారులు తెలిపారు. నిజామాబాద్‌, హైదరాబాద్‌ నుంచి బస్సుల్లో వచ్చి ఇక్కడ సందడి చేస్తున్నారు. రాత్రి హరిత రిసార్ట్‌లో బస చేసి ఉదయం జంగిల్‌ సఫారీ ద్వారా వన్యప్రాణుల పరుగులు, పచ్చని అడవులను అస్వాదిస్తున్నారు. అటవీశాఖ ఏర్పాటు చేసిన బేస్‌క్యాంపు, అధ్యయన కేంద్రాలను పరిశీలిస్తున్నారు. అడవుల్లో నిర్మించిన కుంటల్లో పక్షుల కిలకిలలు చూసి మురిసిపోతున్నారు. తెల్లవారు జామున, సూర్యకిరణాలు, చెట్ల మధ్యన పడటం ఆహ్లాదం పంచుతుంది.



అడవిలో పర్యాటకులు

చెడిపోయిన దారులు..

గేట్‌ నంబర్‌ 1 నుంచి సుమారు 15 కి.మీ దూరం సఫారీ ప్రయాణం ఉంటుంది. గొండుగూడ బేస్‌క్యాంపు, బైసన్‌కుంట ప్రాంతాల్లో చుక్కల దుప్పులు, నీలుగాయిలు, అడవి దున్నలు, రకరకాల పక్షులు ఎక్కువగా కనిపిస్తాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో సఫారీ దారి చెడిపోయినట్లు పర్యాటకులు పేర్కొంటున్నారు. అటవీశాఖ దృష్టిసారించి సఫారీ దారిని బాగు చేయిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సౌకర్యాలు సైతం కల్పించాలని కోరుతున్నారు.

పర్యాటకుల సంఖ్య పెరిగింది



సఫారీ మొదలై 15 రోజుల్లోనే పర్యాటకుల సంఖ్య పెరిగింది. వీకెండ్‌లో గదులు నిండిపోతున్నాయి. ఆన్‌లైన్‌లోనే బుకింగ్‌ చేసుకుంటున్నారు. హైదరాబాద్‌, వరంగల్‌, నిజామాబాద్‌ నుంచి చాలామంది వస్తున్నారు.

– వీరేందర్‌, హరిత మేనేజర్‌

రెండోసారి వచ్చాను



జన్నారం అడవులకు రావ డం ఇది రెండో సారి. ఇక్కడ అందాలు చాలా బాగుంటుంది. సఫారీలో వెళ్లేట ప్పుడు చుక్కలు దుప్పులు, నీలుగాయి పరుగులు కనువిందు చేశాయి. మా గ్రూప్‌ సభ్యులందరూ వాటిని చూసి మురిసిపోయారు. అక్కడక్కడ సఫారీ దారిలో మట్టి పోయించాలి.

– వినీత, హైదరాబాద్‌

17 రకాల పక్షులను గుర్తించాను



సఫారీ ప్రయాణంలో వివిధ రకాల పక్షులు కనిపించాయి. ఇందులో విదేశీ పక్షులు ఉన్నాయి. బైసన్‌కుంట ప్రాంతంలో 17 రకాల పక్షులను గుర్తించాను. ఫొటోలు కూడా తీశాను. బైసన్‌కుంటలో పక్షులు అవాసం ఏర్పాటు చేసుకున్నాయి. అడవులు చాలా బాగున్నాయి.

– సంకలిత దేలినాథ్‌

బలవంతపు పెళ్లికి యత్నం

- 1098కి ఫోన్‌ చేసిన బాలిక
- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌

ఆదిలాబాద్‌రూరల్‌: బాలికకు బలవంతంగా పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు యత్నిస్తున్న ఘటన మావల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన బాలిక(17) ఆదివారం చైల్డ్‌ హెల్ప్‌లైన్‌ 1098కు ఫోన్‌ చేసింది. తల్లిదండ్రులు చిన్న వయస్సులో ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని కాపాడాలని వేడుకుంది. వెంటనే స్పందించిన చైల్డ్‌లైన్‌ సూపర్‌వైజర్‌ అనిల్‌, ష్యూర్‌ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్‌ కె.వినోద్‌, షీటీమ్‌ కానిస్టేబుల్‌ మహేశ్‌, మావల పోలీస్‌ కానిస్టేబుళ్లతో కలిసి బాలిక ఇంటికి వెళ్లారు. బాల్యవివాహంతో జరిగే అనర్థాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వారికి కౌన్సెలింగ్‌ ఇచ్చారు. మేజర్‌ తర్వాతే ఆమెకు ఇష్టం ఉన్నవ్యక్తితో పెళ్లి జరిపిస్తామని ఒప్పందపత్రం రాసి ఇచ్చారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్‌ మాట్లాడుతూ బాలికను బాల సదనానికి తరలించి తాత్కాలికంగా వసతి కల్పిస్తున్నామని తెలిపారు.

వార్డెన్‌ ఆత్మహత్యాయత్నం



నిర్మల్‌ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వార్డెన్‌ రాజగోపాల్‌

లక్సెట్టిపేట: మండలంలోని ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్‌, నిర్మల్‌ జిల్లా ఖానాపూర్‌కు చెందిన రాజగోపాల్‌ ఈనెల 18న సాయంత్రం తన ఇంటి వద్ద యాసిడ్‌ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 17న ఇంటికి వెళ్లిన రాజగోపాల్‌... 18వ తేదీ సాయంత్రం బాత్‌రూంలోకి వెళ్లి యాసిడ్‌ తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నిర్మల్‌ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యను 100 నుంచి 252కి పెంచేలా రాజగోపాల్‌ కృషి చేశాడు. అయితే ఆమేరకు బిల్లులు రాకపోవడంతో రూ.7 లక్షల వరకు సొంతంగా ఖర్చు చేశాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు కూడా తెలిపారు. అయినా బిల్లులు రాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిసింది. దీనిపై సంక్షేమ శాఖ ఉప సంచాలకులు చాతరాజు దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం నిర్మల్‌కు వెళ్లి పూర్తి వివరాలు సేకరిస్తామని తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలుసుకుంటామని పేర్కొన్నారు. ఏఎస్‌డబ్ల్యూవో సురేశ్‌ను వివరణ కోరగా ఈనెల 17న తన తల్లి ఆరోగ్యం బాగాలేదని రాజగోపాల్‌ ఇంటికి వెళ్లినట్లు తెలిపారు.

సాత్నాల ప్రాజెక్టులో దూకి ఒకరి ఆత్మహత్య



పవర్‌ బాలాజీ మృతదేహం

సాత్నాల: మండలంలోని సాత్నాల ప్రాజెక్టులో ఆదివారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎస్సై గౌతమ్‌పవార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రవెల్లి గ్రామానికి చెందిన, పవార్‌ బాలాజీ(37) ఆరు నెలల క్రితం, ఉపాధి కోసం సాత్నాల మండలం రామయికి వలస వచ్చాడు. సీస కమ్మరిగా, చికెన్‌ సెంటర్లో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. మద్యానికి బానిసైన బాలాజీ శనివారం రాత్రి భార్య, అత్తతో గొడవ పడ్డాడు. బామ్మర్దులు వారించారు. ఆదివారం ఉదయం పనికి వెళుతున్నానని చెప్పి, సాత్నాల ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బాలాజీ తమ్ముడు సంజయ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గౌతమ్‌పవార్‌ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..



శేఖర్‌ (ఫైల్‌)

లక్ష్మణచాంద: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పీచర గ్రామానికి చెందిన నైనం శేఖర్‌ (28) గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెందాడు. శనివారం ఉదయం గ్రామసమీపంలో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన గ్రామస్తులు అందించిన సమాచారంతో కుటుంబ సభ్యులు అతన్ని నిర్మల్‌కు తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

అన్వేషిక ప్రయోగదర్శిని రూపకల్పనలో టీచర్‌



సత్యనారాయణ

జైనథ్‌: ఎస్‌సీఈఆర్టీ వారు రూపొందించిన అన్వేషిక ప్రయోగదర్శిని రూపకల్పనలో జిల్లా ఉపాధ్యాయుడికి చోటు లభించింది. మండల కేంద్రంలోని మోడల్‌ స్కూల్‌ ఉపాధ్యాయుడు గోసుల సత్యనారాయణ 6వ తరగతి పాఠ్యాంశంలోని ప్రయోగ కృత్యాలను పుస్తకంలో పొందుపర్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 మంది సబ్జెక్ట్‌ ఉపాధ్యాయులు పాల్గొనగా, ఆదిలాబాద్‌ జిల్లా నుంచి ఈయన పాల్గొన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ జ్ఞానం, విలువలు పెంపొందించడంతోపాటు ప్రయోగకృత్యాలను పుస్తకంలో పొందుపర్చినట్లు తెలిపారు. ఈ అంశాలు ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన వివరించారు.

ఖండాంతరాలు దాటిన నృత్య ప్రదర్శన

కుభీర్‌: మండల కేంద్రానికి చెందిన కళాకారిణి ఠాకూర్‌ అనూష భరతనాట్య నృత్య ప్రదర్శన ఖండాంతరాలకు దాటింది. ఈమె తల్లిదండ్రులు మీరా–కరణ్‌సింగ్‌. తల్లి గృహిణి. తండ్రి ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. అనూషకు చిన్నప్పటి నుంచి పాటలు పాడటం(జానపద) డ్యాన్స్‌ చేయడం చాలా ఇష్టం. ఎంఏ ఇంగ్లిష్‌ విద్యనభ్యసించగా, ఆమె భరతనాట్యంలో డిప్లొమా పూర్తిచేసింది. 2008లో మా టీవీలో వచ్చిన రేలారేలా కార్యక్రమంలో పాల్గొని జానపద పాటలు పాడారు. గురువు సముద్రాల మాధవీ రామానుజం వద్ద భరతనాట్యంలో మెలకువలు నేర్చుకుంది. ఢిల్లీ, ముంబయి, హైదరాబాద్‌, బెంగళూరు, భద్రాచలం, తిరుమల తదితర నగరాల్లో 400లకు పైగా, అమెరికా, యూకే, మలేషియా దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చింది. తండ్రి ఆదిలాబాద్‌లో పనిచేయడంతో ఆమె విద్యాభ్యాసం అక్కడే సాగింది. దేశ,విదేశాల్లో భరతనాట్య ప్రదర్శన చేసిన ఆమె ఎక్కడికెళ్లిన కుభీర్‌ వాసిగా చెబుతోంది.


'పీవీటీజీల అభివృద్ధిపై నిర్లక్ష్యం'



నినాదాలు చేస్తున్న ఆదివాసీ సంఘాల నేతలు

బేల: గిరిజన గ్రామాల పీవీటీజీల అభివృద్ధి, సంక్షేమంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొడప సోనేరావ్‌ ఆరోపించారు. మండలంలోని సదల్‌పూర్‌ గ్రామంలో ఆదివారం నిర్వహించిన కుంరం సూరు, కుమురం భీం వర్ధంతికి ఆయన హాజరయ్యారు. పోరాటయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ గతేడాది దేశంలోని పీవీటీజీల అభివృద్ధి, సంక్షేమం కోసం రూ. 24వేల కోట్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. అందులో భాగంగా తెలంగాణలో రూ. 24 కోట్లు, ఆదిలాబాద్‌ జిల్లాలోని ఉట్నూర్‌ ఐటీడీఏకు నిధులు కేటాయించారని తెలిపారు. పీవీటీజీలకు రూ. 60 లక్షలతో మల్టీహాల్‌ నిర్మించాల్సి ఉండగా కేవలం రూ.45 లక్షలతో నిర్మాణాలు చేపడుతున్నారని విమర్శించారు. అంచనా వ్యయం తగ్గించడంలో అంతరాయం ఏముందని ప్రశ్నించారు. అనంతరం ఇటీవల రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైనా కొడప సోనేరావ్‌ను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమ్ర రాజు, జిల్లా అధ్యక్షుడు మడావి గోవింద్‌రావ్‌, డివిజన్‌ అధ్యక్షుడు టేకం గణేష్‌, ఆదిలాబాద్‌ రూరల్‌ మండల అధ్యక్షుడు కుమ్ర జలపత్‌రావ్‌, బేల మండల అధ్యక్షుడు కొడప జైవంత్‌, గ్రామ మాజీ సర్పంచ్‌ రాందాస్‌, ఆదివాసీ సీనియర్‌ నాయకుడు మడావి జంగు తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా 'కడెం'నీటిమట్టం



కడెం: కడెం ప్రాజెక్ట్‌ నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ఆదివారం 700 అడుగులుగా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌కు 800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో స్వల్పంగా వస్తున్నట్లు ఇరిగేషన్‌ అధికారులు వెల్లడించారు.

బోటు షికారు



కడెం: కడెం ప్రాజెక్ట్‌ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి కనిపించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి బోటింగ్‌ చేశారు. వారు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.